క్లుప్తంగా

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండలంలోని కొండరాగోలు, మధ్య కొండరాగోలు ప్రాథమిక పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల చేతి రాతను పరిశీలించి డబుల్ రూల్, ఫోర్ రూల్ అభ్యసనం చేయాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేస్తూ అర్థమయ్యే రీతిలో పాఠ్యంశాలను బోధించాలన్నారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి



గోవిందరావు

హిరమండలం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గోవిందరావు ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు బుధవారం బదిలీ అయినట్లు ఎస్ఐ జి.నారాయణ స్వామి తెలిపారు. గోవిందరావును ఎస్ఐ, పోలీస్ సిబ్బంది అభినందించారు.

రూ.67,997 రికవరీ చేయాలి

హిరమండలం: ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24లో రూ.12.62 కోట్లతో మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 711 పనులు నిర్వహించారు ఈ పనులపై ఇటీవల క్షేత్రస్థాయిలో జరిపిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు మంగళవారం మండల పరిషత్ ఆవరణంలో ద్వామా పీడీ చిట్టిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో చదివి వినిపించారు. పలు అవకతవకల్లో భాగంగా ఉపాధి సిబ్బంది నుంచి రూ.67,997 రికవరీ చేయాలని పీడీ ఆదేశించారని ఉపాధి ఏపీఓ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. తంప గ్రామంలో 13 మంది వేతనదారులు ఐదు రోజులపాటు పనిచేస్తే.. వేతనాలు అందలేదని డీఆర్పీ గుర్తుంచినట్లు చెప్పారు. సాంకేతిక లోపం వల్ల వేతనాలు అందలేదని, ఆ తరువాత వేతనాలు అందజేశామన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

పొందూరు: సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యం (ఎస్ఎస్ఏ)లో కేజీబీవీ, ఎమ్మార్సీ, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి కోరారు. మండలంలోని లోలుగు కేజీబీవీలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రెండు నెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని, మూడో నెల వస్తున్నా ఇంకా జీతాలు అందలేదన్నారు. అర్హులైన ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలని, నేల ఆరోగ్యవంతంగా ఉంటుందని కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు అన్నారు. మండలంలోని సోభ పంచాయతీలోని కరడాసింగి గిరిజన గ్రామంలో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుచేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పెర్సన్‌లు జి.జగన్, ఎ.చిరంజీవి, శ్రీను, ఎస్.కామేశ్వరరావు, రెంగూడ, గులిమి సింగి గూడ, బుర్జ గూడ, బెన్నా గూడ, లక్ష్మి గూడ గిరిజనులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఆమదాలవలస: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. హెల్మెట్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్ సమస్య రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. న్యాయవాదులకు, బార్ అసోషియేషన్ సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం

సారవకోట: మండలంలోని అవలింగిలోని గుండిచా మందిరంలో బుధవారం గ్రామానికి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం చేపట్టారు. ఇక్కడ జరుగుతున్న జగన్నాథ రథ యాత్రలో భాగంగా స్వామి వారిని నరసింహావతారంలో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.

● హెల్మెట్ ధరించండి..



ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నరసన్నపేట కోర్టు న్యాయవాదులు జామి కామేశ్వరరావు, అప్పారావు అన్నారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందన్నారు. కొత్త చట్టాల ప్రకారం హెల్మెట్ ధరించకపోవడం నేరమని, దీనిని ప్రతీ ఒక్కరూ గుర్తించాలని సూచించారు. మహిళా న్యాయవాది ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. - నరసన్నపేట

● ప్రత్యేక నిఘా..



వంశధార నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హిరమండలం తహసీల్దార్ బి.సుధాకర్ హెచ్చరించారు. వంశధార నదీ తీర ప్రాంతాలను బుదవారం పరిశీలించారు. మండల పరిషత్ రహదారి గుండా ఇసుక రీచ్‌కు వెళ్లే మార్గం వద్ద కందకాలు తవ్వించారు. హిరమండలం నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలని ఆర్ఐలు, వీఆర్వోలను ఆదేశించారు. - హిరమండలం

● విత్తన శుద్ధితో మేలు



ప్రత్తి, మొక్కజొన్న విత్తనాలను శుద్ధి చేసిన తర్వాతే నాటుకోవాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. పొందూరు మండలం బురిడికంచరాంలో బుధవారం రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్ సన్నద్ధంపై రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విత్తనశుద్ధితో పచ్చపురుగు తెగుళ్లు మొదటి దశలో 30 రోజుల వరకు రాకుండా నివారిస్తుందన్నారు. ప్రత్తిలో రసం పీల్చే పురుగులు, మొక్క జొన్నలో కత్తిరి పురుగు నివారణ జరుగుతుందన్నారు. సైంటిస్ట్ డాక్టర్ అనూష, రైతులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. - పొందూరు

కౌలు గుర్తింపు కార్డులతో.. బహుళ ప్రయోజనాలు



నరసన్నపేట: మాట్లాడుతున్న ఏఓ సునీత

- పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు
- కౌలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన

జలుమూరు: కౌలు గుర్తింపు కార్డులతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్‌కుమార్ అన్నారు. రాణ, కరవంజ గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు సమావేశాలను బుధవారం నిర్వహించారు. భూమి యజమానుల హక్కులకు భంగం కలగకుండా పంట మీద మాత్రమే రుణం తీసుకునేందుకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే విత్తనాలు, ఎరువులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాలు, బీమా తదితరవి పొందేందుకు వీలు ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసాచార్యులపేటలో..

ఆమదాలవలస: కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేట రైతు సేవా కేంద్రంలో బుధవారం కౌలు రైతుల గుర్తింపు, నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులను పొందాలన్నారు. పంట రుణాలు, ఈ–పంట నమోదు,పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోళ్లు, రాయితీపై విత్తనాలు, ఎరువులు పురుగు మందులు వంటివి అందించడం జరుగుతుందన్నారు. వరి, వివిధ రకాల పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం భూసార పరీక్ష ఫలితాల పత్రాలను, ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఇఫ్కో డీఎం లోకేష్, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, వీహెచ్ఏ పీసా జగదీశ్వరరావు, వీఆర్వో మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: కరవంజలో మాట్లాడుతున్న ఏఓ సురేష్ కుమార్

కామేశ్వరిపేటలో..

నరసన్నపేట: కౌలు గుర్తింపు కార్డుల కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు. మండలంలోని కామేశ్వరిపేటలో బుధవారం కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డులు 3, 6, 11 నెలల కాల పరిమితితో పొందవచ్చన్నారు. ఈ కార్డులు కౌలు రైతులకు ఇవ్వడం ద్వారా భూయజమానులకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. వాకముళ్ల చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: ఎరువులు అందజేస్తున్న ఏఓ, తదితరులు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

నరసన్నపేట: జిల్లాలో గత రెండు నెలలుగా గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరిగిందని, యువత అటు వైపు చూస్తున్నారని, దీనిపై జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య ప్రతినిధులు నినదించారు. నరసన్నపేటలో మత్తు పదార్థాల వినియోగంతో యువత చిత్తు అవుతున్న పరిస్థితులను బుధవారం వివరిస్తూ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల భారీ నుంచి యువత, విద్యార్థులను రక్షించాలని కోరారు. జిల్లాలో రోజురోజుకీ వినియోగం పెరుగుతుందని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి రవాణా పెరుగుతుందని దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పోలీసుల వైఫల్యం కూడా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం పెరగడానికి ఒక కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈబీ అధికారులు మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలను సేవించి విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు సాంబశివరాజు, గిరి, మోహన్‌కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల చెంతనే మురుగు నీరు

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నా గ్రామాల్లో మాత్రం మురుగునీరు ఎక్కడక్కడ కనిపిస్తోంది. మరో వైపు 'డ్రై' డేలు నిర్వహించి ప్రభుత్వ సముదాయాలు, పాఠశాలల పరసరాలను శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ పదేపదే సూచనలు చేస్తున్నా.. స్థానికంగా స్పందన అంతంత మాత్రంగా ఉంది. దీనికి నిదర్శనం నరసన్నపేట మండలం ముషిడిగట్టు పాఠశాల ప్రహరీకి ఆనుకొని మురుగు నీరు నిల్వే. అటు వైపు వెళ్లే దుర్వాసన వస్తుంది. గత పది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఎవరూ స్పందించడం లేదు. ఈ మురుగు నీరు కారణంగా విద్యార్థులకు మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ముషిడిగట్టు స్కూల్ వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు

బాధ్యతగా విధులు నిర్వహించాలి

బూర్జ: ఉపాధి హామీ పథకం సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ద్వామా పీడీ జి.వి చిట్టిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులతోపాటు ఐటీడీఏ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ, డబ్ల్యూఆర్ తదితర శాఖల ద్వారా సుమారు రూ.21.65 కోట్ల ఖర్చుతో 1,149 పనులు చేశారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గత నెల 19 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలను సామాజిక ప్రజావేదిక ద్వారా డీఆర్పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగాయని, కొలతల్లో తేడాలు ఉన్నాయని వివరించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని, మస్టర్లలో దిద్దుబాటులు, కొట్టివేతలు ఉన్నాయన్నారు. నాటిన కొబ్బరి మొక్కలు కూడా చాలా చోట్ల చనిపోయినట్లు గుర్తించారు. వీటిపై ద్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ పనుల్లో రూ.1.60 లక్షలు, ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.1.20 లక్షలు రికవరీ చేయాలన్నారు. ఏపీడీ పి.రాధ, ఎస్టీఎం వై.గౌరీ శంకరరావు, ఈవీఓ విజిలెన్స్ అధికారి బి.లవరాజు, క్లస్టర్ ఏపీడీ సైలజ, హెచ్ఆర్ మేనేజర్ ఎ.శ్రావణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ వి.రాజ్‌కుమార్, సర్పంచ్ ఏగు అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ద్వామా పీడీ చిట్టిరాజు

డెంగీ జ్వరాలపై అప్రమత్తం

నరసన్నపేట: వర్షా కాలంలో డెంగీ జ్వరాలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత అన్నారు. ఉర్లాం బీసీ వసతి గృహ విద్యార్థులకు డెంగీపై బుధవారం అవగాహన కల్పించారు. రెండు రోజులు కంటే ఎక్కువగా జ్వరం ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. సాధారణ జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయవద్దన్నారు. వసతి గృహాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రతలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గణపతిరావు, వెంకటరమణ, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆమదాలవలస: గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కొర్లకోట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సాగర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్ పి.భవాని, ఆశ వర్కర్ గోవిందమ్మ, గ్రామ సర్వేయర్ హేమలత, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, ఆరోగ్య శాఖ సిబ్బంది భగవాన్ దాస్, కుమారి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

ఎల్.ఎన్.పేట: రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని రావిచంద్రి రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం ఎరువుల పంపిణీ చేపట్టారు. ఎరువులు కావలసిన రైతులు వారి వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బంది వద్ద నమోదు చేసుకుని నగదు చెల్లించాలన్నారు. కొత్తూరు వ్యవసాయ శాఖ ఏడీ రాజగోపాలరావు, ఏఓ పైడి లతశ్రీ, రైతులు పాల్గొన్నారు.

ఇసుక విధానంపై అవగాహన ర్యాలీ

పాతపట్నం: నూతన ఇసుక విధానంపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం పాతపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి మార్కెట్, ఆల్ ఆంధ్ర రోడ్డు, ఆస్పత్రి కూడలి మీదుగా కోర్టు జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు న్యాయం జరగాలన్న ఆలోచనతో ఎన్డీఏ కూటమి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ర్యాలీలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు, కూటమి నాయకులు

పైనాపిల్ ఉత్పత్తులతో అధిక ఆదాయం

ఆమదాలవలస: పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం పొందవచ్చని కె.వి.కె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన యువతకు వృత్తి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పైనాపిల్ క్యాండీని తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహాపరిశోధన సంచాలకులు ముకుందరావు, శాస్త్రవేత్తలు, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యులు పాల్గొన్నారు.

అడ్డంగిలో..

కొత్తూరు: మండలంలోని అడ్డంగి గిరిజన గ్రామంలో పైనాపిల్ విలువ అధారిత ఉత్పత్తులపై గిరిజన యువకులకు కేవీకే ఆమదాలవలసకు చెందిన శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యంలో భాగంగా గిరిజన యుతవకు శిక్షణ ఇస్తున్నారు.



ఆమదాలవలస: పైనాపిల్ ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎల్.ఎన్.పేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని, లేకపోతే ఐక్య పోరాటాలను ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. కొర్కెల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు, వెలుగు, మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ పథకం, సేంద్రియ వ్యవసాయం, 108, 104, మెప్మా, తదితర స్కీముల్లో పని చేస్తున్న సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



జలుమూరు: డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు



పోలాకి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు



ఆమదాలవలస: తహసీల్దారు కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు, నాయకులు



మెళియాపుట్టి: తహసీల్దార్ జానకమ్మకు సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్మికులు

గోతులు పూడ్చారు..



గోతులను పూడ్చుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని పాలకొండ–హడ్డుబంగి రోడ్డులో నివగాం వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. నివగాం మాజీ సర్పంచ్ నూలు వీరభద్రస్వామి బుధవారం గోతులను పూడ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గులివిందలపేట ఎంపీపీ పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులు డిక్టేషన్ బుక్‌లు, నోట్స్‌లను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచికరమైన భోజనం అందివ్వాలని ఆదేశించారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సమీపంలో ఉన్న ఇరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం శాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com